
దేవాలయంవీధి భీమేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



సర్పవరం శివాలయంలో నీలకంఠేశ్వరస్వామికి అభిషేకం


అరట్లకట్టలోని మల్లేశ్వరస్వామి


కరప పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరునికి పూజలు


కరపలో భక్తుల కోలాహలం


పులిహోర పంపిణీ చేస్తున్న దాతలు


రమణయ్యపేటలోని ఏకామ్రేశ్వరునికి అన్నాభిషేకం


వేళంగిలో భవానీశంకరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

శివనామ స్మరణం.. సర్వపాప హరణం..

- ప్రతిధ్వనించిన పంచాక్షరి మంత్రం
- తెల్లవారు జామునుంచే పూజలు
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కాకినాడ రూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని నియోజవర్గ ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. హర హర మహాదేవ శంభో శంకరా అంటూ స్వామిని వేడుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. నేమాం, తూరంగి, సూర్యారావుపేట, సర్పవరం, పండూరు, ఇంద్రపాలెం, రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ, గోకుల్ గార్డెన్, కొవ్వాడ, తదితర గ్రామాల్లోని శివాలయాలలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పలు గ్రామాల్లో శివాలయాలను దర్శించుకున్నారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ, సూర్యారావుపేట, సర్పవరం జంక్షన్ వద్ద బ్రహ్మ కుమారీస్ ఏర్పాటు చేసిన 25 అడుగుల శివలింగాన్ని ఆయన దర్శించుకున్నారు. సూర్యారావుపేటలో స్వయంగా శివలింగానికి అభిషేకం చేసుకున్నారు. అక్కడ భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే కన్నబాబుతో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరప: స్థానిక అతిపురాతనమైన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి లింగోద్భవ పూజలు చేశారు.ఈఓ వడ్డాది సత్తిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చినమామిడాడ పంచముఖేశ్వరస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఏర్పాట్లను పర్యవేక్షించగా, అర్చకుడు చంద్రమౌళి అన్నపూర్ణేశ్వరశర్మ పూజాదికాలు నిర్వహించారు. అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి అర్చకులు కొంతేటి సత్యనారాయణమూర్తి పూజలు చేయగా ఈఓ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దాపురప్పాడులో ఉమాపార్వతి సమేత రామలింగేశ్వరస్వామికి, నడకుదురులోని బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో, గురజనాపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, పెనుగుదురులోని బాలాత్రిపురసుందరి సీతేశ్వరస్వామి, వేళంగిలోని బాలాత్రిపుర సుందరి సమేత భవానీశంకరస్వామి, వేములవాడ భీమకవి జన్మస్థలమైన వేములవాడలో మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, వాకాడలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరుడు, కూరాడలోని భద్రకాళీ సమేత వీరేశ్వరుడు, కరపలోని సుబ్రమణ్యేశ్వరాలయంలో, గొర్రిపూడిలో బసవేశ్వరస్వామి ఆలయంలో, ఉప్పలంక శివారు మొండిలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. కొరుపల్లి శివాలయంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి ఆలయధర్మకర్త దేవిశెట్టి అప్పలస్వామి పూజలు నిర్వహించారు. మాణిక్యాంబసమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త పలివెల సత్తిరాజు, అర్చకుడు పూజలు చేశారు. ఈ సందర్భంగా ముత్తైదువులు కైలాసగౌరి నోమును తీర్చుకున్నారు. చొల్లంగిలో రాజరాజేశ్వరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో, నడకుదురు విఘ్నేశ్వరాలయంవద్ద ఉమామహేశ్వరస్వామికి అభిషేకాలు, సహస్రజ్యోతిర్లింగార్చన పూజలు చేశారు. చెరువులో మాజీ సర్పంచ్ యాసలపు దుర్గాప్రసాద్ కుటుంబసభ్యులు విద్యుద్దీపాలతో అలంకరించి ఏర్పాటు చేసిన శివలింగం, శివపార్వతులు భక్తులను ఆకట్టుకున్నాయి.


సూర్యారావుపేటలో కైలాస సహస్ర మహాలింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు


భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హిమలింగం

నగరంలో..

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని పురాతన భీమేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దాతల సహకారంతో ప్రసాదం పంపిణీ చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి తెలిపారు. రామారావుపేటలో అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష అభిషేకాలు చేశారు. భానుగుడిలోని భానులింగేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం ఆకట్టుకుంది. స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలత్రిపురసుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆర్డీఓ బి.వెంకటరమణ, కాకినాడ మాజీ మేయర్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ఆలయంలో గౌరీనోములు నోచుకున్నారు.

హరిహరసేవా సమితి ఆధ్వర్యంలో..

స్థానిక రామారావుపేటలోని సౌమ్య ఎన్‌క్లేవ్‌లో హరిహర సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక మహాన్యాస పూర్వక పార్థివ లింగార్చన నిర్వహించారు. బండముళ్ల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సేవా సమితి అధ్యక్షులు నందమూరి వీరవెంకట వినోద్ తదితరులు సుమారు 50 మంది లింగార్చనలో పాల్గొన్నారు. పీఠం గౌరవ అధ్యక్షుడు అరిగెల శ్రీనివాసరావు, రవి గురుస్వామి పీఠం ఉపాధ్యక్షుడు అంకంరెడ్డి రామునాయుడు, కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, పబ్బినీడి శ్రీనివాస్, సతీష్, భానోజీరావు పాల్గొన్నారు.

తురంగేశ్వర ఆలయంలో..

కాకినాడ సిటీ: తురంగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పోటెత్తారు. ధర్మకర్తల మండలి చైర్మన్ గొల్లపల్లి సూర్యప్రకాశరావు (బాబులు) అన్ని ఏర్పాట్లు చేశారు.

భక్తులకు పులిహోర వితరణ

బాలాజీచెరువు: స్థానిక భానుగుడి ఉష బాల త్రిపుర సుందరి సమేత భాను లింగేశ్వర ఆలయం వద్ద ప్రకృతి అవెంచర్ జీఎం వి.వీరరాఘవులు, టీవీఎస్ఎస్ ప్రసాదరెడ్డి సిబ్బంది వై.ప్రసాద్, చందు భక్తులకు పులిహోర అందజేశారు.

సత్కళావాహినిలో..


సత్కళావాహినిలో శివపార్వతుల కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో శనివారం సంకురాత్రి మంజరి సంగీత కళాశాల విద్యార్థులకు భక్తిగీతాల పోటీలు నిర్వహించారు. అనంతరం లలిత–విష్ణు సహస్రనామ పారాయణం, భక్తి సినీ కీర్తనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు శివుని స్తుతిస్తూ కీర్తనలు ఆలపించారు. శివరాత్రి విశిష్టతను సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు భక్తులకు వివరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో కుంజుక లక్ష్మి, శ్రీకృష్ణ, పావనీ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశ్రామిక ప్రమాదాలను నివారించాలి

కాకినాడ సిటీ: ఫ్యాక్టరీల్లోని కార్మికులకు రక్షణ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని, పరిశ్రమల తనిఖీలను పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఎన్జీవో హోంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వరావు, ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి తాళ్లూరి రాజు, టీఎన్‌టీయూసీ నగర అధ్యక్షులు గదుల సాయిబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ తదితరులు మాట్లాడారు. పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించకుండా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న ఫ్యాక్టరీల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ తదితర అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించాలని అఖిలపక్షం తీర్మానం చేసింది.

బాలాజీదాస్‌కు నివాళి


బాలాజీదాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు జీఎస్ బాలాజీదాస్ వర్ధంతిని శనివారం సుందరయ్యభవన్‌లో సీఐటీయూ నగరకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. యూనియన్ నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, చెక్కల రాజ్‌కుమార్, ఐద్వా నగర ప్రధాన కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం : నలుగురి అరెస్టు

పెద్దాపురం: మండల పరిధిలోని జె.తిమ్మాపురంలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురు నిందితులను శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ అధికారులు తెలిపారు. ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు అందిన సమాచారంతో గ్రామానికి చెందిన పిల్లి రామలక్ష్మి, ఆమె భర్త పిల్లి వెంకటరమణ తమిళనాడుకు చెందిన గోపాలకృష్ణ రాజేష్ కన్నన్‌తో కలసి గంజాయి అక్రమంగా రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేడీ పేటకు చెందిన శివంగి నూకరాజు అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నాడన్న సమాచారం మేరకు నలుగురితో పాటు మోటారు సైకిల్, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ తెలిపారు. వీరిలో ఒకరు పరారీలో ఉన్నారని, అతని కోసం ప్రత్యేక బృందం ద్వారా విచారణ చేపడుతున్నట్లు వారు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థుల ప్రతిభ


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో సంస్థల ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం

బాలాజీచెరువు: ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకు చెందిన డాంగ్ ఏహెచ్ ఎలక్ట్రికల్ ఇండియా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 31 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు శనివారం తెలిపారు. ఈసీఈ, ఈఈఈ, మెకానికల్‌కు చెందిన 60 మంది పాల్గొనగా కంపెనీ నిర్వహించిన వివిధ దశల ఇంటర్వ్యూలో ఉద్యోగాలు సాధించారన్నారు. కరెస్పాండెంట్ డాక్టర్ చిరంజీవినికుమారి, గవర్నింగ్ బాడీ సభ్యులు జీవీ కృష్ణంరాజు, ఏవో జీవీకే వర్మ, పీఆర్‌ఓ సాయిబాబు విద్యార్థులను అభినందించారు.

సస్యరక్షణతో సరైన పోషకాలు

- ఎంఏఓ రాజేష్
- వరిలో లోపాల నివారణకు సూచనలు

కరప: రబీలో వరిపంటపై పోషక లోపాల వల్ల పైరు ఎదుగుదల లేక పసుపుబారుతోందని రైతులు అంటున్నారు. వెదజల్లిన పొలాల్లో పోషక లోపాలు ఉన్నట్టు వ్యవసాయాధికారులు గుర్తించారు. రైతులు అప్రమత్తమై సత్వర చర్యలు చేపడితే పైరు ఏపుగా పెరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు అంటున్నారు. కరప ఎంఏఓ ఏవీ రాజేష్, వీఏఏలతో కలసి గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. చలి తీవ్రత వల్ల వరిమొక్కలు ఇనుప, జింకు ధాతువులను గ్రహించలేక పోతున్నాయని, దీనివల్ల పైరు ఎదుగదల లేక గిడసబారినట్టు కనిపిస్తాయన్నారు. రైతులు వెంటనే ఈ ధాతువులను పైపాటుగా అందించాలని సూచించారు.

ఇనుము ధాతు లోపానికి..

మొక్కల ఆకులు లేతపసుపు రంగులోకి మారి, ఆకుల చివర మాడడాన్ని ఇనుము ధాతులోపంగా గుర్తించాలన్నారు. దీని నివారణకు చేలో కనీసం ఒక అంగుళంలోతు నీరుండాలి. ఒక గ్రాము నిమ్మ ఉప్పు ఒక లీటరు నీటిలో కరిగించిన ద్రావణానికి 5 గ్రాముల అన్నబేధి (ఫెర్రస్ సల్ఫేటు) మోతాదులో కలిపి 150 లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరాకు ఉదయం 9 గంటల తర్వాత పిచికారీ చేయాలి.


ఇనుము, జింకు ధాతు లోపాల వల్ల ఎదుగుదల లేక పసుపువర్ణంలో కనిపిస్తున్న వరిచేను

జింకు ధాతు లోపానికి..

ఆకుల మీద తుప్పు రంగు మచ్చలు ఏర్పడి, ఆకులలో మధ్య ఈనె పెళుసుగా మారడాన్ని జింకు ధాతు లోపంగా గుర్తించాలి. దీనివల్ల మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. ఎంత మోతాదులో రసాయనిక ఎరువులు వేసినా వరి మొక్కలు గ్రహించలేవు. చేను ఎదుగుదలలేక గిడసబారిపోతుంది. జింకు ధాతు లోప నివారణకు ఒక లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి 150 లీటర్ల మందు ద్రావణం ఒక ఎకరాకు పిచికారీ చేయాలి. ఇలా వారం రోజుల వ్యవధిలో మరోసారి పిచికారీ చేయాలి. రాబోయే రోజుల్లో వరిలో చీడపీడలను గమనిస్తూ వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

మనోహర్‌రెడ్డి మృతి

కాకినాడ లీగల్: కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జిగా పనిచేసిన జి.మనోహర్‌రెడ్డి శనివారం గుంటూరులో అనారోగ్యంతో మృతి చెందారు. 2021 ఆగస్టు నుంచి మూడు నెలల పాటు ఆయన ఇక్కడ విధులు నిర్వహించారు. అంతకుముందు లా సెక్రటరీగా, ఒంగోలు అదనపు జిల్లా జడ్జిగా పనిచేశారు. ఇదే సమయంలో ఆయనపై పలు ఫిర్యాదులు హైకోర్టుకు అందాయి. హైకోర్టు 2021లో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తరులు జారీ చేసింది. విచారణ కోసం కాకినాడలో ఉండాలని పేర్కొంది. ఇటీవల ఆయన హైకోర్టు అనుమతి తీసుకుని గుంటూరు వెళ్లారు. అక్కడ చనిపోయినట్లు న్యాయశాఖ వర్గాల ద్వారా సమాచారం.

అవినీతి ఎంఎన్‌వోపై విచారణ

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో బయాప్సీ చేసేందుకు రోగిని స్ట్రెచర్‌పై తీసుకువెళ్లి తీసుకొచ్చినందుకు డబ్బులు వసూలు చేసిన ఎంఎన్‌వో (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ) పై అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. బాధితురాలు వెదుళ్ల తులసమ్మ భర్త రాంబాబు ఫిర్యాదు మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి శనివారం విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమా మహేశ్వరరావు, పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంఎస్ రాజులను విచారణ కమిటీ సభ్యులుగా నియమించారు. వారి విచారణ నివేదిక ఆధారంగా రోగి భర్తను రుబాబు చేసి రూ.2,500 వేలు వసూలు చేసిన ఎంఎన్‌వోపై చర్యలకు సిద్ధం కానున్నారు. సోమవారం నుంచి విచారణ కొనసాగనుంది.

పైశాచిక భర్తపై ఫిర్యాదు

కాకినాడ క్రైం: పొరుగింటి వ్యక్తితో కలసి భర్త తనను లైంగికంగా వేధిస్తున్నారని ఓ మహిళ శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలాజీచెరువు పిండిప్రోలు వారి వీధికి చెందిన వివాహితకు 15 ఏళ్ల క్రితం శివగణేష్‌కుమార్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కొన్నాళ్లుగా వారి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఆమె నివసిస్తున్న అపార్టుమెంటు పై అంతస్తులో ఉంటున్న నల్లూరి శ్రీనివాసరావుతో శివగణేష్‌కుమార్‌కు పరిచయం ఏర్పడింది. విభేదాల నేపథ్యంలో విచక్షణ కోల్పోయిన అతడు తన భార్యపై శ్రీనివాసరావుతో లైంగిక వేధింపులకు ప్రోత్సహించాడు. వారి హింస తాళలేక బాధితురాలు చేసిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.20 కోట్లతో వర్సిటీకి వసతులు

- విద్యార్థుల సమస్యకు త్వరలో పరిష్కారం
- శరవేగంగా పీజీ హాస్టళ్ల భవన నిర్మాణం
- మరిన్ని రూ.కోట్లతో అభివృద్ధి పనులు


వర్సిటీలో నిర్మిస్తున్న పీజీ వసతి గృహం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే విద్యార్థుల వసతి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు కేవలం ఇంజినీరింగ్ విద్యార్థులకు మాత్రమే వసతి సదుపాయం ఉండేది. ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ వంటి పీజీ కోర్సుల విద్యార్థులకు ఆ వసతి లేకపోవడంతో వారు ప్రైవేట్ హాస్టళ్లపై ఆధారపడుతున్నారు. ఈ సమస్యతో కొందరు మహిళా విద్యార్థులు ఏడాదికి ఐదు నుంచి పది మంది వరకు డ్రాపౌట్ అవుతున్నారు. ఈ సమస్యపై గతంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించి అప్పటి రూసా (రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్) కో–ఆర్డినేటర్‌గా ఉన్న ప్రస్తుత వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు యూజీసీ 12, 13వ పంచవర్ష ప్రణాళికలో అమలు చేసేలా రూసా పథకం ద్వారా రూ.20 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో రాష్ట్ర మంత్రులతో శంకుస్థాపన చేయించి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

రూసా నిధులు కేంద్రం రూ.12 కోట్లు, రాష్ట్ర వాటా రూ.8 కోట్లు మొత్తం రూ.20కోట్లతో వర్సిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. తొలి విడతగా రూ.10 కోట్లు విడుదల చేశారు. వీటిలో రూ.ఆరు కోట్లతో హాస్టల్స్ భవనాలు, రూ.నాలుగు కోట్లతో పాత భవనాల ఆధునీకరణ, ఆధునిక పరికరాలు తదితర అవసరాలకు వినియోగిస్తున్నారు. నరసారావు పేట కళాశాల భవనం ప్రారంభోత్సవం పేరుతో అప్పటి సీఎం చంద్రబాబు రూ.55 లక్షలు వృథా చేశారు కానీ, ఒక్క అడుగైనా అభివృద్ధి బాట పట్టలేదు.

నిరాడంబరంగా శంకుస్థాపన

గత నెలలో వర్సిటీలో దాదాపు రూ.50 కోట్లతో చేపట్టనున్న రోడ్లు ,డ్రైనేజీ, స్నాతకోత్సవ భవనాలకు శంకుస్థాపనలు చేసి పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టారు. ఇప్పటికే రూ.20 కోట్లతో చేపట్టే రోడ్లు, డ్రైనేజీలకు డ్రాయింగ్‌తో సర్వే పూర్తి చేశారు.

ఈ ఏడాది చివరలో ప్రారంభోత్సవం..



పీజీ హాస్టల్ భవనం ఈ ఏడాది చివరికి అందుబాటులోకి తేచ్చేలా చర్యలు తీసుకుంటాం. వర్సిటీలో చేపట్టే భవనాల నిర్మాణం, వాటి ప్రగతిపై ప్రతి నెలా సమీక్షిస్తున్నాం. శంకుస్థాపనలతో సరిపెట్టకుండా ప్రారంభోత్సవాలు అట్టహాసంగా చేయాలని భావిస్తున్నాం. రూసా కో–ఆర్డినేటర్‌గా నేనున్న కాలంలో రాష్ట్ర మంత్రులచే శంకుస్థాపన జరిగింది కాబట్టి వాటిని పూర్తిచేయాలనే సంకల్పంతో ఉన్నాను. వర్సిటీలో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీ, స్నాతకోత్సవ భవనాలు పూర్తిచేసి ముఖ్యమంత్రిచే ప్రారంభించాలనే సంకల్పంతో ఉన్నాను.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే

వీనుల విందుగా గాన గంధర్వుల స్వరాభిషేకం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో సీతారామరాజు స్మారక కళావేదిక, క్షత్రియ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గాన గంధర్వుల స్వరాభిషేకం సంగీత విభావరి అలరించింది. ఘంటసాల శతజయంతి వేడుకలలో భాగంగా శనివారం సాయంత్రం ఏర్పాటు కార్యక్రమంలో ముందుగా ఇటీవల మృతి చెందిన సినీ నటులు కృష్ణంరాజు, కృష్ణ, కె.విశ్వనాథ్, కైకాల సత్యనారాయణ, జమున, గాయకురాలు వాణీ జయరామ్, కళాపోషకులు బాదం మాధవరావు చిత్రపటాలకు నివాళులు అర్పించారు. టౌన్ హాల్ అధ్యక్షులు కె.భామిరెడ్డి తదితర వక్తలు స్మారక కళావేదిక, పరిషత్ కళారంగ సేవలను కొనియాడారు. అనంతరం గాయకులు బాలు, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు ఆలపించిన సినీ గీతాలు శ్రోతలను అలరించాయి. కళాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని కళావేదిక వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్షులు కర్రి అచ్చుతరామారెడ్డి, పరిషత్ అధ్యక్షులు యువరాజు, పెద్దాడ సూర్యకుమారి, ఉద్దగళ సుబ్బారావు, చిక్కాల రామచంద్రారావు, జానకిరామ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.